తుది జాబితా ఇదే...

ఓటర్ లిస్ట్ విడుదల చేసిన అధికారులు

● సనత్‌నగర్ నియోజకవర్గ ఓటర్లు 2,33,447



సనత్‌నగర్ నియోజకవర్గ ఓటరు తుది జాబితాను విడుదల చేస్తున్న సిబ్బంది

సనత్‌నగర్: నియోజకవర్గ ఓటరు తుది జాబితాను గురువారం ప్రచురించారు. దీనికి సంబంధించిన ప్రతిని బేగంపేట సర్కిల్ కార్యాలయంలోని నోటీసుబోర్డులో ఏర్పాటుచేశారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ (ఎస్ఎస్ఆర్)–2023లో భాగంగా జనవరి 1, 2023 వరకు 18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు కల్పించడంతో పాటు చిరునామా మార్పు వంటి సవరణలకు అవకాశం మిచ్చి అన్ని రాజకీయ పార్టీల నేతల అభ్యంతరాలు, సలహాలు, సూచనలను స్వీకరించారు. వాటన్నింటిని పరిగణలోనికి తీసుకున్న సనత్‌నగర్ నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, బేగంపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ముకుందరెడ్డి ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకారం తుది జాబితా వివరాలను ప్రకటించారు. తుది జాబితా ప్రకారం నియోజకవర్గంలో 2,33,447 మంది ఓటర్లుగా ఉన్నారు. అందులో పురుషులు 1,21,844 మంది, మహిళలు 1,11,598 మంది, ఇతరులు (ట్రాన్స్‌జెండర్స్) 5 మంది ఉన్నారు. నవంబర్ 9న ప్రచురించిన ముసాయిదా ఓటరు జాబితా కంటే తుది జాబితాలో అదనంగా 2,428 మంది ఓటర్లుగా నమోదయ్యారు. ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం 2,31,019 ఓటర్లు ఉండగా తుది జాబితా ప్రకారం 2,33,447 మంది ఓటర్లకు పెరిగారు. కొత్తగా పెరిగిన 2,428 మంది ఓటర్లలో పురుషులు 1083, మహిళలు 1345 మంది ఉన్నారు.

● సికింద్రాబాద్ నియోజకవర్గ ఓటర్లు 2,46,893



ఓటరు జాబితా డ్రాఫ్ట్‌రోల్ విడుదలచేస్తున్న ఎన్నికల అధికారి దశరథ్

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గం ఓటర్ల జాబితా డ్రాఫ్ట్‌రోల్‌ను గురువారం ఎన్నికల అధికారులు విడుదల చేశారు. పలు కసరత్తుల అనంతరం జీహెచ్ఎంసీ ఎన్నికల అధికారులు బుధవారం ఓటర్ల జాబితాకు తుదిరూపు ఇచ్చారు. చిరునామాల మార్పులు, తప్పొప్పుల సవరణలు, కొత్తగా పేర్ల నమోదు, తొలగింపుల అనంతరం కొత్త జాబితాను జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ ఎన్నికల అధికారి టీ.దశరథ్ విడుదల చేశారు. జీహెచ్ఎంసీ కార్యాలయంలో సందర్శకుల కోసం ఉంచిన డ్రాఫ్ట్‌రోల్‌కు ఎన్నికల కమిషన్ అధికారులు లాంఛనంగా ఆమోదముద్ర వేయాల్సి ఉంది. జీహెచ్ఎంసీ ఎన్నికల విభాగం అధికారులు సిద్ధంచేసిన 2023 ఓటర్ల జాబితా డ్రాఫ్ట్‌రోల్ ప్రకారం నియోకవర్గ ఓటర్ల సంఖ్య 2,46,893 కు చేరింది. ఇందులో పురుషులు 1,24,599, స్త్రీలు 1,22,275, ఇతరులు 19 మంది ఉన్నట్టు అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి టీ.దశరథ్ మాట్లాడుతూ ఓటర్ల సంఖ్య ప్రాతిపదికన పోలింగ్ స్టేషన్లను, బూత్‌ల ఎంపిక ప్రక్రియను కూడా పూర్తి చేశామన్నారు. నియోజకవర్గంలోని ఐదు మున్సిపల్ డివిజన్లలోని 98 భవనాల్లో 220 పోలింగ్ కేంద్రాలను ఎంపిక చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సహాయక ఎన్నికల అధికారి నరసింహారెడ్డి, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ అజయ్‌కుమార్, ఎన్నికల విభాగం సెక్షన్ ఇన్‌ఛార్జి కే.భుజేందర్‌బాబు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన



ఏసీఎస్ నగర్‌లో పర్యటించిన కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట: ఎప్పటికప్పుడు సమస్యలను తెలుసుకొని దశలవారీగా వాటిని పరిష్కరిస్తామని కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి తెలిపారు. గురువారం ఆజాద్ చంద్రశేఖర్ నగర్లో స్థానిక సమస్యలపై ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని బస్తీవాసులు కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో వెంటనే స్పందించిన ఆమె సంబంధిత సిబ్బందిని పిలిపించి పనులు చేయించారు. అనంతరం, మాట్లాడుతూ ఏసీఎస్ నగర్లో డ్రైనేజీ సమస్య పరిష్కారానికై గతంలోనే ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపడం జరిగిందని తెలిపారు. అతి త్వరలో పనులను ప్రారంభించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు. ఈ పర్యటనలో నగర గ్రంథాలయ డైరెక్టర్ లింగాని శ్రీనివాస్, మనోహర్, వడ్లూరి రవి, గోపి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



చేతిపంపును పరిశీలిస్తున్న సీపీఐ నేతలు

అడ్డగుట్ట: డివిజన్ పరిధిలోని నెలకొన్న సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సీపీఐ సికింద్రాబాద్ కన్వీనర్ కాంపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ నాయకులు సీ సెక్షన్లో పర్యటించి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బస్తీవాసులు వారి సమస్యలను విన్నవించుకున్నారు. అనంతరం కాంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ సీసెక్షన్లోని మసీదు బస్తీలో తీవ్రమైన నీటి సమస్య ఉందన్నారు. గతంలో ఇక్కడ ఉన్నటువంటి చేతిపంపు పాడైపోయిందని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎవ్వరూ పట్టించుకోవడం లేదని స్థానికులు చెప్పుకొస్తున్నారన్నారు. అదే విధంగా స్థానికంగా ఉన్న నాలా పక్కనే ఖాళీ స్థలం ఉండడంతో అది పూర్తిగా చెత్తాచెదారంతో నిండిపోయిందని, దీంతో దుర్గంధం వెదజల్లుతుందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ పర్యటనలో సీపీఐ నాయకులు ఉమర్ఖాన్, శంకరయ్య, రంజిత్ సింగ్, యాదగిరి, రషీద్, ఖాజా, ఎస్‌కే. లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు చండీహోమం..

సనత్‌నగర్: పౌర్ణమిని పురస్కరించుకుని సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం దుర్గామాత అమ్మవారి ఆలయంలో శుక్రవారం చండీహోమం నిర్వహిస్తున్నట్లు ఈఓ శ్రీనివాసరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు చండీహోమం జరుగుతుందన్నారు. అలాగే శ్రీదత్తాత్రేయ ఆలయంలో ఉదయం 6 గంటలకు అభిషేకం, 9.30 గంటలకు దత్త హోమం, సాయంత్రం 7 గంటలకు పల్లకీ సేవ కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

మంత్రితో డీజీపీ మర్యాదపూర్వక కలయిక



మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసిన డీజీపీ అంజనీకుమార్

సనత్‌నగర్: తెలంగాణ రాష్ట్ర డీజీపీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన అంజనీకుమార్ గురువారం రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి..అంజనీకుమార్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

డీజీపీకి శుభాకాంక్షలు..



శుభాకాంక్షలు తెలుపుతున్న బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి

సనత్‌నగర్: రాష్ట్ర డీజీపీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అంజనీకుమార్‌కు బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి శుభాకాంక్షలు తెలిపారు. డీజీపీ కార్యాలయంలో గురువారం ఆయనను కలిసిన ఆమె పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఓయూ రెగ్యులర్ డిగ్రీ కోర్సుల సెమిస్టర్ పరీక్షల ఫీజు గడువు పెంపు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని వివిధ కాలేజీల్లో రెగ్యులర్ డిగ్రీ కోర్సులు చదవుతున్న విద్యార్థులు ఈ నెల 25 వరకు మొదటి సెమిస్టర్ పరీక్ష ఫీజులు చెల్లించవచ్చని అధికారులు గురువారం తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ కోర్సుల్లో 2022–23 విద్య సంవత్సరం మొదటి సెమిస్టర్ విద్యార్థులు అపరాధ రుసుములేకుండ ఈ నెల 20, రూ.500 అపరాధ రుసుముతో 25 వరకు ఫీజు చెల్లించ వచ్చు అని అధికారులు తెలిపారు. పూర్తి వివరాలను ఉస్మానియా.ఏసీ.ఇన్ వెబ్‌సైట్లో చూడవచ్చు.

సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం

అమీర్‌పేట్: మహిళలను ప్రోత్సహించేందుకు వారికి ఉచితంగా శిక్షణ అభినందనీయమని సినీ నటుడు సుమన్ అన్నారు. శుక్రవారం అమీర్‌పేట్‌లో శ్రీ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. మహిళలు తమ కాళ్ళ మీద తాము నిలబడేందుకు ఇలాంటి స్వచ్ఛంద సంస్థలు మరిన్ని ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమార స్వామి పాల్గొన్నారు.

సత్తా చాటిన మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు



ఫోక్ డ్యాన్స్‌లో ద్వితీయ స్థానాన్ని సాధించిన బేగంపేట మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు..

సనత్‌నగర్: జిల్లా స్థాయి యువజనోత్సవాలు–2023లో బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభను చాటారు. ఫోక్ డ్యాన్స్‌లో ద్వితీయ స్థానాన్ని, ఫోక్ సింగింగ్‌లో తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా బహుమతులు గెలుచుకున్న విద్యార్థినులను ప్రిన్సిపాల్ పద్మావతితో పాటు అధ్యాపక సిబ్బంది అభినందించారు.

గ్రూప్స్ రాత పరీక్షలపై అవగాహన సదస్సు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో రేపు (7న) గ్రూప్–2, 3, 4 ఉద్యోగాల రాత పరీక్షలపై అవగాహన సదస్సును నిర్వహించనున్నారు. ఓయూ స్కిల్ డెవలప్‌మెంట్ కమిటీ (ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు ఆర్ట్స్ కాలేజీలోని 133 తరగతి గదిలో జరిగే సదస్సుకు వివిధ శిక్షణ కేంద్రాల అధ్యాపకులు ఉద్యోగాల పోటీ పరీక్షల పై అవగాహన, మెళుకువల గురించి బోధించనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమానికి పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు హాజరుకావాలని కోరారు.

సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ ఆదర్శం

– మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



కళ్యాణలక్ష్మీ చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, చిత్రంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి..

సనత్‌నగర్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో కొనసాగుతున్న ప్రభుత్వం ప్రవేశపెట్టి ప్రజా సంక్షేమ పథకాలు యావత్ భారతావనికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్ డివిజన్‌కు చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను గురువారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసంలో మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను దేశం అనుసరిస్తున్నదన్నారు. ఆడపిల్లల పెళ్లిళ్లకు అండగా నిలబడతూ వారికి ఆర్థిక సహాయం చేస్తున్న ఏకైక ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వమేనన్నారు. అత్యధిక సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం అగ్రగామిగా నిలిచిందన్నారు. ఈ ఎనిమిదేళ్లలో సనత్‌నగర్ నియోజకవర్గంలో వందలాది కోట్ల అభివృద్ధి పనులు కొనసాగాయన్నారు. గత పాలకులు పట్టించుకోని దీర్ఘకాలిక సమస్యలను సైతం సవాల్‌గా తీసుకుని పరిష్కరించడం జరిగిందన్నారు. సనత్‌నగర్ ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా సబ్‌స్టేషన్ స్థలాన్ని సేకరించి బాటిల్‌నెక్‌గా ఉన్న అక్కడి మూల మలుపును సైతం విశాలంగా విస్తరించి ట్రాఫిక్ వెతలను తీరుస్తామన్నారు. కార్యక్రమంలో సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, నాయకులు బాల్‌రెడ్డి, జమీర్‌బేగ్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

కేలెండర్ ఆవిష్కరించిన డిప్యూటీ స్పీకర్

సికింద్రాబాద్: నగరంలోని లైట్స్ అండ్ లైట్స్ కంపెనీ రూపొందించిన కొత్త సంవత్సరం క్యాలెండర్‌ను శాసనసభ డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావుగౌడ్ గురువారం ఆవిష్కరించారు. సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కంపెనీ నిర్వాహకుడు అనూప్‌కుమార్, బౌద్ధనగర్ కార్పొరేటర్ కంది శైలజ, మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత పాల్గొన్నారు.



కేలెండర్ ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్

డిగ్రీ పరీక్షల విధుల పారితోషికాన్ని పెంచండి



రిజిస్ట్రార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న డిగ్రీ అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో డిగ్రీ పరీక్షల విధులు నిర్వహిస్తున్న అధ్యాపకుల పారితోషకాన్ని పెంచాలని వినతి పత్రం సమర్పించారు. గురువారం తెలంగాణ డిగ్రీ కాలేజీల లెక్చరర్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కిశోర్‌కుమార్, కోశాధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణకు వినతి పత్రం సమర్పించారు. విద్యార్థుల పరీక్షల ఫీజులను పెంచిన మూల్యాంకణ విధుల పారితోషకాన్ని పెంచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

బీజేవైఎం నేతల అరెస్ట్

అడ్డగుట్ట: పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో జరిగిన అవకతవకల గురించి బీజేవైఎం ఆధ్వర్యంలో ప్రగతి భవన్ ముట్టడి ధర్నాలో అరెస్ట్ అయిన వారిని లాలాగూడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బిజేవైఎం నేతలను ఆ పార్టీ రాష్ట్ర నాయకులు బండ చంద్రారెడ్డి పరామర్శించి సంఘీభావం తెలియజేశారు. అరెస్ట్ అయిన వారిలో బిజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాష్, ప్రధాన కార్యదర్శి అరుణ్, సందీప్, శివాజీ, శివ, రాజు నేత, నరేష్ యాదవ్, విక్రమ్ తదితరులు ఉన్నారు.



అరెస్ట్ అయిన బిజేవైఎం నేతలతో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకులు బండ చంద్రారెడ్డి

శబరియాత్రకు తరలిన అయ్యప్ప భక్తులు



లాలాపేట నుంచి శబరిమల యాత్రకు తరలివెళుతున్న స్వాములు

లాలాపేట: లాలాపేట స్వాములు అయ్యప్ప సేవా సమితి, లక్ష్మీ గణపతి అయ్యప్ప దేవస్థానం ఆధ్వర్యంలో గురువారం తార్నాక డివిజన్ లాలాపేటకు చెందిన పలువురు అయ్యప్ప స్వాములు శబరిమల యాత్రకు తరలివెళ్లారు. అంతకంటే ముందుగా లాలాపేటలోని దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి ఇరుముడ్లు ధరించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ నియోజక వర్గం టీడీపీ ఇంచార్జి వల్లారపు శ్రీనివాస్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కాలం 41 రోజుల పాటు భక్తి శ్రద్ధలతో నిష్టతో దీక్ష చేస్తున్న మాలధారుల స్వామి దర్శనం యాత్ర విజయవంతం కావాలనీ ఆకాంక్షించారు. కార్యక్రమంలో గురుస్వాములు రాము, కె. శ్రీనివాస్‌గౌడ్, దేవాలయం కోశాధికారి జగన్‌మోహన్‌రావు పాల్గొన్నారు.



దూరవిద్య కోర్సుల్లో ప్రవేశాలు

ఉస్మానియా యూనివర్సిటీ:ఓయూ ప్రొఫెసర్ జి.రామిరెడ్డి దూరవిద్య కేంద్రంలో 2022–23 విద్యా సంవత్సరానికి వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు ప్రకటన విడుదల చేసినట్లు డైరెక్టర్ ప్రొ.జీబీ రెడ్డి గురువారం తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులతో పాటు వివిధ పీజీ, పీజీ డిప్లొమా కోర్సుల్లో రెండో విడత ప్రవేశాలకు మార్చి 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఉద్యోగాల పదోన్నతులకు, యూనివర్సిటీ ఉన్నత విద్యకు దూరవిద్య కోర్సుల డిగ్రీ సర్టిఫికెట్లు రెగ్యులర్ కోర్సుల మాదిరి ఉపయోగపడుతాయన్నారు. ఆసక్తి అర్హత గల అభ్యర్థులు ఉస్మానియా.ఏసీ.ఇన్ వెబ్‌సైట్ చూడవచ్చు.

రైలుకిందపడి వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్: అప్పులబాధ తాళలేక రైలుకింద పడి ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గురువారం సికింద్రాబాద్ రైల్వేపోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. మౌలాలి హౌజింగ్‌బోర్డుకు చెందిన విప్పులపల్లి రాజశేఖర్ (45) ఎలక్ట్రీషియన్‌గా జీవనం సాగిస్తున్నాడు. వృత్తితో సరైన ఆదాయం లేని ఫలితంగా అప్పులపాలయ్యాడు. రెండేళ్లుగా వృత్తిగా దూరంగా ఉంటుండడం, అప్పుల బాధలు పెరిగిపోయిన కారణంతో లాలాగూడ రైల్వేస్టేషన్ సమీపంలో రైలుకిందపడి ఆత్మహత్యకు ప్రయత్నించగా తీవ్ర గాయాలపాలయ్యాడు. రైల్వే సిబ్బంది అప్రమత్తత కారణంగా అంబులెన్స్‌లో రాజశేఖర్‌ను నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. కొద్ది గంటల పాటు చికిత్స అందించిన అనంతరం రాజశేఖర్ మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం చేయించిన పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైళ్లలో సెల్‌ఫోన్లు చోరీ.. నిందితుల రిమాండ్



సెల్‌ఫోన్‌ల చోరీ వివరాలు వెల్లడిస్తున్న జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీను

సికింద్రాబాద్: రైలు ప్రయాణికుల మొబైల్ ఫోన్లను దొంగతనం చేయడమే వృత్తిగా ఎంచుకుని జల్సాలు చేస్తున్న ఇద్దరిని సికింద్రాబాద్ రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. నిందితులు నేరాలకు పాల్పడుతున్న తీరును గురువారం జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీను విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మల్లాపూర్‌కు చెందిన డ్రైవర్ సంగం మహేశ్ (31), నాచారంకు చెందిన సెంట్రింగ్ వర్కర్ కట్టల దుర్గాప్రసాద్ (21) స్నేహితులు. వృత్తి ద్వారా సరిపడా ఆదాయం రాకపోవడం, జల్సాలు చేయాలనే కోరికలు ఉన్న కారణంతో రైలు ప్రయాణికుల సెల్‌ఫోన్లు దొంగిలించాలన్న నిర్ణయానికి వచ్చారు. సికింద్రాబాద్–లాలాగూడ రైల్వేస్టేషన్ల మధ్య నిదానంగా వెళ్లే రైళ్లను ఎంపిక చేసుకుని ఫుట్‌బోర్డు ప్రయాణాలు చేయడం, ప్రయాణికుల సెల్‌ఫోన్లు దొంగిలించి పారిపోవడం వృత్తిగా ఎంచుకున్నారు. దొంగిలించిన సెల్‌ఫోన్లు విక్రయించడం ద్వారా వచ్చే సొమ్ముతో ఇరువురు నిందితులు జల్సాలు చేసేవారు. రైల్వేపోలీసుల బృందం స్టేషన్ పరిసరాల్లో తనిఖీలు చేస్తున్న సమయంలో ఈ ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా పట్టుబడ్డారు. పొంతన లేని సమాధానాలు చెప్పుతున్న క్రమంలో ఇరువురిని అదుపులోకి తీసుకుని విచారించగా సెల్‌ఫోన్ల చోరీ వ్యవహారం వెలుగుచూసింది. నిందితుల నుంచి నాలుగు విలువైన సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు వారిని రిమాండ్‌కు తరలించారు.

అగ్ని ప్రమాదం



టీవీ దగ్ధమైన దృశ్యం

రసూల్‌పురా: షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగి ఆస్తినష్టం జరిగింది. ఇంట్లో ఎవరూ లేక పోవడంతో ప్రాణ నష్టం జరగలేదు. ఈ ఘటన బొల్లారం పీఎస్ పరిధిలోని లక్డావాలా బస్టాప్ సమీపంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. లక్డావాలాలో మాజీ సైనికుడు హరినాథ్ కుటుంబసభ్యులతో మొదటి అంతస్తులో నివాసం ఉంటున్నాడు. కింది పోర్షన్‌లో అతడి తల్లిదండ్రులు ఉంటు న్నారు. కాగా మొదటి అంతస్తులో ఎవరు లేని సమయంలో టీవీ నుంచి షార్ట్ షర్క్యూట్ జరిగి మంటలంటుకున్నాయి. మంటలను గమనించి కింది పోర్షన్ నుంచి కూడ హరినాథ్ కుటుంబసభ్యుల బయటికి వచ్చారు. ఈ ప్రమాదంలో టీవీతో పాటు రిఫ్రిజిరేటర్, సోఫా సెట్, వంట సామగ్రి మొత్తం కాలి బూడిదయ్యాయి. సమాచారం అందుకున్న అగ్ని మాపక విభాగానికి చెందిన ఫైరింజన్ సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకవచ్చారు. షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగిందని అగ్నిమాపక విభాగం అధికారి రాఘవరెడ్డి తెలిపారు.

అందె శ్రీనివాస్ కుటుంబానికి అండగా ఉంటాం

రసూల్‌పురా: తెలంగాణ మలి దశ ఉద్యమకారుడు అందె శ్రీనివాస్ కుటుంబానికి అండగా ఉంటామని కంటోన్మెంట్ ఎమ్మెల్యే జి. సాయన్న, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు తెలిపారు. ఇటీవల అందె శ్రీను అనారోగ్యంగా మరణించడంతో బొల్లారం ఆదర్శనగర్‌లో ఆయన నివాసంలో గురువారం సాయన్న, మైనంపల్లితో సహా పలువురు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు ఎర్రోళ్ళ శ్రీనివాస్, గజ్జెల నాగేష్, మన్నే క్రిషాంక్ తదితరులు పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాహన కార్యక్రమం

రసూల్‌పురా: ఎడెల్ వైజ్ టోకియో లైఫ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో మోహన్ ఫౌండేషన్ భాగస్వా మ్యంతో అవయవదానంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు జిందగీ ఎక్స్‌ప్రెస్ పేరుతో కంటోన్మెంట్‌లో గురువారం యాత్రను ప్రారంభించింది. ఈ సందర్భంగా టివోలీ మోక్షలో ఇన్సూరెన్స్ ఎండీ సీఈఓ సుమిత్‌రాయ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఈ రిలే మారథన్ యాత్ర మూడు వారాల పాటు 50 నగరాల గుండా ఐదు వేల ఐదొందల కి. మీ కొనసాగుతుందని తెలిపారు.

డిగ్రీ కోర్సుల వన్‌టైం ఛాన్స్ పరీక్షల ఫీజుగడువు పొడిగింపు

ఉస్మానియా యూనివర్సిటీ: వివిధ డిగ్రీ కోర్సుల వన్‌టైం ఛాన్స్ పరీక్షల ఫీజుగడువును పొడిగించినట్లు అధికారులు గురువారం తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని పలు కాలేజీల్లో బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ 3 సంవత్సరాల రెగ్యులర్ కోర్సులు(పాత బ్యాచ్) 2000 నుంచి 2014 వరకు చదివి పరీక్షల్లో తప్పిన పూర్వవిద్యార్థులు తిరిగి పరీక్షను రాసుకునేందుకు అవకాశం కల్పించారు. అపరాధ రుసుము లేకుండా ఈ నెల 20 వరకు, రూ.500 అపరాధ రుసుముతో 25 వరకు ఫీజు చెల్లించవచ్చని అధికారులు పేర్కొన్నారు. వివరాలకు ఉస్మానియా.ఏసీ.ఇన్ వెబ్‌సైట్ చూడవచ్చు.

ఉపాధ్యాయుడ్ని అవమానపర్చిన వారిని శిక్షించాలి

అడ్డగుట్ట: దళిత ఉపాధ్యాయుడ్ని అవమానపర్చిన వారిని చట్టపరంగా శిక్షించాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన డిమాండ్ చేశారు. గురువారం అడ్డగుట్టలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లా కోటగిరి ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న తెలుగు టీచర్‌ను బిజేపీ, విశ్వహిందు పరిషత్ వాళ్లు నాస్తికుడు అంటూ అవమానపరచడం సరైంది కాదన్నారు. అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379